ఆదివారం
SUNDAY
4-10-2026
సంపుటి: 2 Volume:2 ‖ సంచిక: 97 Issue: 97
జగిత్యాల JAGITIAL ‖ పేజీలు: (PAGES):12 వెల (PRICE): 2.00
Circulated to Telangana
Published from Jagitial

# నేటి ఈవార్తలు

PRGI REGD NO: TGTEL/25/A1385
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

Circulated to Telangana
Published from Jagitial

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play

• పాక్‌ను చెరబట్టి..



• గోల్స్ కొట్టి..



• ఉడుంపట్టు పట్టి..



• గురిచూసి కొట్టి..




## స్వర్ణోత్సవ సమరం

ఆసియా క్రీడలు-2026లో భారత్ అద్భుత ప్రదర్శనతో పోటీలను ముగించింది. చివరి రోజు భారత్ ఐదు స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్యాలతో మొత్తం తొమ్మిది పతకాలు సాధించింది. దీంతో భారత్ మొత్తం 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో 85 పతకాలుసాధించింది. పురుషుల క్రికెట్ ఫైనల్లో భారత్ 19 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించి వరుసగా రెండోసారి స్వర్ణం సాధించింది. మహిళల జట్టు కూడా ఇప్పటికే స్వర్ణం గెలవడంతో క్రికెట్‌లో భారత్ స్వర్ణ ద్వయం పూర్తి చేసింది. హాకీలో భారత్ 5-1తో మలేషియాను ఓడించి వరుసగా రెండోసారి పురుషుల స్వర్ణాన్ని దక్కించుకుంది. దీంతో 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు భారత్‌కు అర్హత లభించింది. ఆసియా క్రీడల్లో పురుషుల, మహిళల హాకీలో ఒకేసారి స్వర్ణాలు సాధించిన తొలి భారత జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. కుస్తీలో అమన్ సెహ్రావత్ స్వర్ణం సాధించగా, ఆర్చరీలో కుమ్‌కుమ్ మోహోడ్ వ్యక్తిగత రికర్వ్ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో మహిళల వ్యక్తిగత రికర్వ్‌కు భారత్‌కు అర్హత లభించింది.

# రేవంత్ ఫ్యామిలీ 50,000 కోట్ల స్కాం!

## బినామీలతో భారీ కుంభకోణం?

- దుంప శిరీష పేరుతో కోట్ల ఆస్తులు
- మెడికవర్, మ్యాక్స్ బీఎన్ ఫార్మా..
- ఇంటర్నేషనల్ స్కూల్ వరకు వ్యాపార సామ్రాజ్యం
- బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆరోపణలు
- రాష్ట్రపతి సహా ప్రముఖులకు లేఖాస్త్రం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సంబంధించిన వ్యాపారాలు, పెట్టుబడులు, ఆస్తుల వ్యవహారంపై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేసింది. కుటుంబ సభ్యుల పేర్లతో పాటు దుంప శిరీష వంటి వ్యక్తుల పేర్లలోనూ వ్యాపార ప్రయోజనాలు ఉన్నాయని, వీటి వెనుక బినామీ సంబంధాలపై అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మొత్తం వ్యవహారంలో సుమారు రూ.50 వేల కోట్ల మేర అక్రమాలు జరిగాయంటూ ఆయన ఆరోపించారు.



హైదరాబాద్, అక్టోబర్ 3(ఈవార్తలు): క్రిశాంక్ ప్రధానంగా మెడికవర్ ఆసుపత్రులు, మ్యాక్స్‌బీఎన్ ఫార్మా, మైండ్‌వాల్ కన్‌స్ట్రక్షన్స్, గీతా ఆటోమోటివ్స్, నైమిషా రెడ్డి పేరుతో చేపడుతున్న విద్యా సంస్థలకు సంబంధించిన యాజమాన్య వాటాలు, పెట్టుబడులు, డైరెక్టర్ల వివరాలపై ప్రశ్నలు లేవనెత్తారు. ముఖ్యంగా దుంప శిరీష పలు సంస్థల్లో భాగస్వామిగా లేదా డైరెక్టర్‌గా ఉన్నట్లు పేర్కొంటూ, ఆమెకు రేవంత్‌రెడ్డి కుటుంబంతో ఉన్న వ్యాపార సంబంధాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికవర్ వ్యవహారంపై ప్రశ్నలుసహృదయ హెల్త్‌కేర్‌కు సంబంధించిన మెడికవర్ ఆసుపత్రి వ్యాపారంలో దుంప శిరీషకు వాటాలు ఉన్నాయని క్రిశాంక్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఆసుపత్రి విలువ, పెట్టుబడులు, వాటాల మార్పిడి, ఆర్థిక లావాదేవీలను దర్యాప్తు సంస్థలు పరిశీలించాలని కోరారు. సహృదయ హెల్త్‌కేర్ ఆర్థిక సామర్థ్యం గణనీయంగా తరువాయి 2 వ పేజీలో...




# నెస్లే పాల పౌడర్ డేంజర్

### డైరీ వైట్నర్ అమ్మకాలను నిలిపివేయాలి

## ఎఫ్ఎస్ఎస్ఏఐ వార్నింగ్

ప్రముఖ బహుళజాతి ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థ 'నెస్లే'కు చెందిన 'లో ఫ్యాట్ డైరీ వైట్నర్' నాణ్యతా ప్రమాణాల పరీక్షల్లో విఫలమైంది. ఈ ఉత్పత్తి సురక్షితం కాదని, అత్యంత నాసిరకమైనదని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ప్రకటించింది. న్యూఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లోని ప్రఖ్యాత పంచతార హోటల్ 'ది లలిత్' (భారత్ హోటల్స్ లిమిటెడ్) ప్రాంగణం నుంచి సేకరించిన నెస్లే డైరీ వైట్నర్ నమూనాలను ఫుడ్ అనలిస్ట్ ల్యాబొరేటరీలో సమగ్రంగా పరీక్షించారు.

న్యూఢిల్లీ: ఈ పరిశోధనల్లో సదరు ఉత్పత్తి 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం 2006' నిబంధనలను ఉల్లంఘించినట్లు రుజువైంది. ఈ పరిణామంపై స్పందించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ.. హోటల్ నిర్వాహకులైన భారత్ హోటల్స్ లిమిటెడ్‌కు అధికారికంగా నోటీసులు జారీ చేయడంతో పాటు, సదరు ల్యాబ్ నివేదిక కాపీని అందజేసింది. గుర్తించిన ఈ అన్‌సేఫ్ డైరీ వైట్నర్ అమ్మకాలను, వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆహార వ్యాపార నిర్వాహకులను ఆదేశించింది. అయితే చట్ట ప్రకారం నిర్దేశిత గడువులోగా ఈ నివేదికపై అప్పీల్ చేసుకునే అవకాశాన్ని హోటల్ యాజమాన్యానికి కల్పించినట్లు నియంత్రణ సంస్థ స్పష్టం చేసింది.

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,028 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,351 |

# అన్ని ఎన్నికలు రద్దు!

## దేశవ్యాప్తంగా అన్నీ అక్రమ ఎన్నికలే

### బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు తేవాలి.. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే డిమాండ్

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు.



కలబురిగి: "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, తరువాయి 2 వ పేజీలో...




# సత్యాగ్రహ.. సమస్యలను వింటాం!

### కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిన రాహుల్ గాంధీ.. ఉపయోగించుకోవాలని రేవంత్ రెడ్డి పిలుపు

న్యూఢిల్లీ, హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై పోరాడుతున్న వారి గొంతుకలను ఏకం చేసే లక్ష్యంతో 'సత్యాగ్రహ' పేరుతో ఒక కొత్త వేదికను ఆయన ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. దేశవ్యాప్తంగా సత్యం అణచివేతకు గురవుతోందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు తమ గళం తరువాయి 2 వ పేజీలో...

## 13 రోజులు దసరా సెలవులు

### 10 నుంచి 22 వరకు హాలీడేస్



హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): రాష్ట్రంలోని దసరా పండుగ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికిగాను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవుల తేదీలను శనివారం ప్రకటించింది. ఈసారి పాఠశాలలకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. విద్యాశాఖ-2 వ పేజీలో...

## విశ్వవాణి



మనం వేసే ప్రతి అడుగుతో కాళ్ల కింది భాగంలోని కండరాలు శరీరంలో కీలకమైన రక్త ప్రసరణ ప్రక్రియకు తోడ్పడుతున్నాయి. ముఖ్యంగా కాలి పిక్కల కండరాలు సంకోచించినప్పుడు లోతైన సిరలపై ఒత్తిడి ఏర్పడి, రక్తాన్ని గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా గుండె వైపు పంపిస్తాయి. దీనినే 'కాలి కండరాల పంపు'గా పేర్కొంటారు. సిరల్లో ఉండే చిన్న ఏకదిశ కవాటాలు రక్తం తిరిగి కాళ్ల వైపు ప్రవహించకుండా అడ్డుకుంటాయి. కండరాలు సంకోచించినప్పుడు రక్తం పైకి వెళ్తుంది. కండరాలు సడలినప్పుడు సిరలు మళ్లీ రక్తంతో నిండుతాయి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. అందుకే, కాళ్ల కండరాలను కొన్నిసార్లు శరీరంలోని 'రెండో గుండె'గా పిలుస్తారు.




# నయారా షాక్

### పెట్రో ధరలు భారీగా పెంపు

### పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంపు

### ప్రభుత్వ రంగ బంకుల్లో మారని ధరలు

న్యూఢిల్లీ: వాహనదారులకు నయారా ఎనర్జీ షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచింది. పెట్రోల్‌పై లీటరుకు రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా నయారా ఎనర్జీకి ఉన్న 7,000కు పైగా పెట్రోల్ బంకుల్లో కొత్త ధరలు అమలవుతున్నాయి. తరువాయి 2 వ పేజీలో...

# పిల్లల సేఫ్టీకి 'ఫ్రేమ్‌వర్క్'

## ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ప్రణాళిక

### మహిళలు, పిల్లల రక్షణే తొలి ప్రాధాన్యం.. సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ తరువాయి 2 వ పేజీలో...





# చికెన్ కిలో రూ.500?

### భారీగా పెరగనున్న చికెన్, గుడ్ల ధరలు

### గుడ్డు రూ.25కు చేరే అవకాశం

న్యూఢిల్లీ: రాబోయే రోజుల్లో చికెన్ ధరలు ఆకాశాన్నంటే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం కిలో రూ.250గా ఉన్న చికెన్ ధర ఏకంగా రూ.400 నుంచి రూ.500కు, కోడిగుడ్డు ధర రూ.20-25కి పెరగవచ్చని పౌల్ట్రీ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ అనూహ్య పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ ఇంధన విధానాలే ప్రధాన కారణమని వారు విశ్లేషిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్ కలపడాన్ని ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఇథనాల్ ఉత్పత్తి కోసం మొక్కజొన్నను భారీగా వినియోగిస్తున్నారు. దేశంలో ఇథనాల్ ఉత్పత్తిలో మొక్కజొన్న వాటా ప్రస్తుతం 37 శాతానికి చేరింది. ఇదే సమయంలో, కోళ్ల దాణాలో 55 నుంచి 60 శాతం వాటా మొక్కజొన్నదే. దీంతో ఇంధన పరిశ్రమ నుంచి, పౌల్ట్రీ పరిశ్రమ నుంచి మొక్కజొన్నకు డిమాండ్ అమాంతం పెరిగిపోయింది. ఈ పోటీ కారణంగా మొక్కజొన్న ధరలు గత కొన్నేళ్లుగా -2 వ పేజీలో...

# రాశి ఫలాలు



4.10.2026

మేషం: నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి కలుగుతుంది. కీర్తి ప్రతిష్టలకు లోటు ఉ ఒడదు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు.

వృషభం: వ్యాపారాలలో భాగస్వాములతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. దూరప్రయాణాలు వీలైనంత వరకు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో ఊహించని వివాదాలు చోటు చేసుకుంటాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. గృహనిర్మాణ ఆలోచనలు మందకొడిగా సాగుతాయి.

మిథునం: విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. పాత ఋణాలు తీరి ఊరట చెందుతారు. మీ మాటకు విలువ పెరుగుతుంది. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ముఖ్యమైన వ్యవహారాల్లో జాప్యం కలిగిన నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది.

కర్కాటకం: దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు సేకరిస్తారు. కుటుంబంలో సమస్యల నుంచి బయటపడతారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. భూ సంబంధిత క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

సింహం: గృహ వాహన కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. భాగస్వామ్య వ్యాపారాలను విస్తరిస్తారు. సంతాన విద్య ఉద్యోగ ప్రయత్నాలు కలిసివస్తాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పాత మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలను అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగులకు శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలకు నూతన పెట్టుబడులు అందుతాయి. సోదరుల నుంచి శు భకార్య ఆహ్వానాలు అందుతాయి.

తుల: ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. బంధువులతో ఏర్పడిన వివాదాలు రాజీ చేసుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కొన్ని వ్యవహారాలలో సోదరుల నుంచి సహాయ సహకారాలు అందుతాయి.

వృశ్చికం: గృహ నిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. సంతానానికి నూతన విద్యావకాశాలు దక్కుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యులతో సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

ధనస్సు: చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తిచేస్తారు. అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగులకు అధికారుల సహాయం లభిస్తుంది. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు.

మకరం: వ్యాపారాలలో పెట్టిన పెట్టుబడులకు తగిన లాభాలు అందుకుంటారు. ఋణ బాధల నుంచి బయటపడతారు. నూతన వ్యక్తుల పరిచయాలు భవిష్యత్ కు ఉపయోగపడతాయి. గృహనిర్మాణ ఆలోచనలు మందకోడిగా సాగుతాయి. దూర ప్రాంతాల నుంచి అందిన వార్త సంతోషాన్నిస్తుంది.

కుంభం: విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న అవసరానికి ధన సహాయం అందుతుంది. చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. బంధువుల నుంచి అందిన ఆహ్వానాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు కలసివస్తాయి.

మీనం: వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆర్థిక లావాదేవీలు ఉత్సాహాన్నిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

# రేవంత్ ఫ్యామిలీ 50,000 కోట్ల

**మొదటి పేజీ తరువాయి**

పెరిగిందని, రెండేళ్ల వ్యవధిలో ఆదాయం 689 శాతం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అలాగే మెడికవర్‌కు సంబంధించిన లావాదేవీల్లో రూ.13 వేల కోట్ల మేర నల్లధనం చెలామణి జరిగిందని ఆరోపిస్తూ, దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

## మ్యాక్స్‌బీఎన్ ఫార్మాపైనా ఆరోపణలు

మ్యాక్స్‌బీఎన్ ఫార్మా కంపెనీలో రేవంత్‌రెడ్డి అల్లుడు సత్యనారాయణతో పాటు దుంప శిరీష పాత్రపై కూడా క్రిశాంక్ ప్రశ్నలు లేవనెత్తారు. కంపెనీ యాజమాన్య నిర్మాణం, వాటాలు, పెట్టుబడులు, సంబంధిత వ్యక్తుల మధ్య ఆర్థిక లావాదేవీలను పరిశీలించాలని ఆయన కోరారు. గీతా ఆటోమోటివ్స్ పేరుతో హ్యుందాయ్ వాహనాల షోరూమ్‌లు ప్రారంభమైన అంశాన్ని కూడా క్రిశాంక్ ప్రస్తావించారు. 2024లో రేవంత్‌రెడ్డి హ్యుందాయ్ ప్రతినిధులను కలిసిన అనంతరం హైదరాబాద్‌లో ఐదు షోరూమ్‌లు ఏర్పడ్డాయని ఆయన పేర్కొంటూ, వాటి యాజమాన్యం, పెట్టుబడులపై వివరాలు వెల్లడించాలని కోరారు. కొంపల్లిలో రేవంత్‌రెడ్డి కుమార్తె నైమిషా రెడ్డి పేరుతో అంతర్జాతీయ పాఠశాల నిర్మాణం జరుగుతోందని, అందులో దుంప శిరీష భాగస్వామిగా ఉన్నారని క్రిశాంక్ ఆరోపించారు. మెడికవర్, మ్యాక్స్‌బీఎన్ ఫార్మా, మైండ్‌వాల్ కన్‌స్ట్రక్షన్స్, పాఠశాల వంటి సంస్థల్లో ఒకే వ్యక్తి పాత్ర ఉండటంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ సంస్థల యాజమాన్య, పెట్టుబడి సంబంధాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన వ్యాపారాలు, ఆస్తులు, పెట్టుబడులు, వాటాల నిర్మాణం, సంబంధిత పక్షాల మధ్య లావాదేవీలపై సమగ్ర స్వతంత్ర దర్యాప్తు జరపాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించిన పత్రాలు, కంపెనీల వివరాలు, ఆర్థిక సమాచారాన్ని దర్యాప్తు సంస్థలకు అందజేస్తామని క్రిశాంక్ తెలిపారు. ఆరోపణలు తప్పని నిరూపిస్తే బహిరంగంగా క్షమాపణలు చెబుతానని కూడా ఆయన సవాల్ చేశారు.

## బీఆర్ఎస్ లేఖలు

మెడికోవర్ ఆసుపత్రిలో సీఎం రేవంత్ బినామీల వాటా, అల్లుడు సత్యా గోలుగూరి మాక్స్ బియన్ ఫార్మా, ఎనుముల నిమిషా రెడ్డి మైండ్ వాల్ట్ నిర్మాణ సంస్థతో చేపడుతున్న కార్పొరేట్ స్కూల్స్ , ఇటీవలే మేడికోవర్ ఆసుపత్రిని అమ్మి దక్కించుకున్న రూ.13,200 కోట్లపై విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అన్ని ఆధారాలను జతపరిచి అన్ని పార్టీల జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులకు , విచారణ సంస్థలకు బీఆర్ఎస్ లేఖ పంపించింది. రేవంత్ రెడ్డి రూ.వేల కోట్ల బినామీ వ్యాపారాల పూర్తి వివరాలు విచారణ జరిపించాలని లేఖలో కోరింది. రేవంత్ రెడ్డి కూతురు నైమిషారెడ్డి బినామీ వ్యాపారాలపై విచారణ జరిపించాలని ఈడీ, రాష్ట్రపతి, లోక్ భవన్, ప్రధాని మోడీతో పాటు పలు విచారణ సంస్థలకు లేఖ రాసింది.






# నయారా షాక్

**మొదటి పేజీ తరువాయి**

అంతర్జాతీయంగా ముడిచమురు, ఇంధన ధరలు పెరగడంతో కొనుగోలు వ్యయం పెరిగిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది నయారా ఎనర్జీ ఇంధన ధరలను పెంచడం ఇది రెండోసారి. మార్చిలోనూ పెట్రోల్, డీజిల్‌పై ఇదే స్థాయిలో ధరలు పెంచింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో అప్పట్లో ధరలు పెంచింది. ముడిచమురు ధరలు తగ్గడంతో జులైలో ఆ పెంపును వెనక్కి తీసుకుంది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను మార్చలేదు. దేశంలో 1.04 లక్షలకు పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటిలో 90 శాతానికి పైగా ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలోనే ఉన్నాయి. ఇటీవల ప్రైవేటు ఇంధన విక్రయ సంస్థలు పెట్రోల్, డీజిల్ అమ్మకాలను తగ్గించకూడదని కేంద్రం సూచించింది. ఇదిలా ఉంటే వాణిజ్య అవసరాలకు ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు అక్టోబర్‌లో రూ.62.50 మేర పెంచాయి. 19 కిలోల సిలిండర్ ధర పెరిగింది. అయితే గృహ వినియోగ ఎల్పీజీ ధరను రూ.942 వద్దే కొనసాగిస్తున్నాయి. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధర కూడా పెరిగింది. లీటరుకు రూ.16 చొప్పున పెంచడంతో దేశీయ విమాన సంస్థలకు లీటర్ ఏటీఎఫ్ ధర రూ.121 నుంచి రూ.137కు చేరింది.

# చికెన్ కిలో రూ.500?

**మొదటి పేజీ తరువాయి**

పెరుగుతూనే ఉన్నాయి. ఐదేళ్ల క్రితం కిలో రూ.14-15 ఉన్న మొక్కజొన్న ధర, ప్రస్తుతం మార్కెట్లో రూ.25-28కి చేరింది. కొన్ని ప్రాంతాల్లో ఇది రూ.32 వరకు పలుకుతోంది. ఫలితంగా, పౌల్ట్రీ ఫీడ్ ధరలు కూడా పెరిగాయి. ఏప్రిల్‌లో కిలో రూ.25 ఉన్న ఫీడ్, సెప్టెంబర్ నాటికి రూ.30 దాటింది. పౌల్ట్రీ ఉత్పత్తి ఖర్చులో 65-70 శాతం దాణాకే పోతుండటంతో ఈ భారం నేరుగా చికెన్, గుడ్ల ధరలపై పడుతోంది. ఇప్పటికే ఇథనాల్



డిమాండ్‌తో సతమతమవుతున్న పౌల్ట్రీ రంగానికి 'ఎల్ నినో' ప్రభావం మరో పెద్ద దెబ్బగా మారింది. వర్షాభావ పరిస్థితులు, బలహీనమైన రుతుపవనాల వల్ల ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. దేశీయ మొక్కజొన్న ఉత్పత్తిలో సాధారణంగా 60 శాతం పౌల్ట్రీ రంగమే వినియోగిస్తుంది. ఇప్పుడు ఇథనాల్ పరిశ్రమ నుంచి పోటీ పెరగడం, మరోవైపు దిగుబడి తగ్గడంతో సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. గత ఏడాదిలోనే గుడ్డు ధరలు 35-40 శాతం పెరిగాయి. ఫామ్ వద్దే గుడ్డు ధర రూ.6కు చేరగా, రిటైల్ మార్కెట్లో రూ.7 నుంచి రూ.9 వరకు అమ్ముతున్నారు. రానున్న శీతాకాలంలో డిమాండ్ పెరిగితే ఈ ధరలు మరింతగా పెరగడం ఖాయమని రైతులు చెబుతున్నారు. ఈ సంక్షోభం నేపథ్యంలో, ప్రభుత్వం మొక్కజొన్న ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని లేదా ఇథనాల్ తయారీకి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంధన అవసరాల కన్నా దేశంలో ఆహార భద్రతకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.




# పిల్లల సేఫ్టీకి 'ఫ్రేమ్‌వర్క్'

**మొదటి పేజీ తరువాయి**

సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జిమెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.



# 13 రోజులు దసరా సెలవులు

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు 13 రోజుల పాటు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. ఇక జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియట్) విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజులు సెలవులు ప్రకటించారు. వీరికి అక్టోబర్ 22న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు అక్టోబర్ 9వ తేదీతో ముగియనున్నాయి. అదే రోజున జరగాల్సిన 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్చారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

## 10 నుంచి బతుకమ్మ పండుగ

బతుకమ్మ పండగను ఈ నెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 18వ తేదీన సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలతో ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు సంజయ్ జాజు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉండే అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తో పాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సీఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతుండడంతో ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు.

# సత్యాగ్రహ.. సమస్యలను వింటాం!

**మొదటి పేజీ తరువాయి**

విప్పుతున్నారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. భూమి, మహిళల హక్కులు, దళిత, ఓబీసీల హక్కులు, విద్య, పరీక్షల్లో అక్రమాలు వంటి అనేక అంశాలపై ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని తెలిపింది. ఇలా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి, వాటిని సమన్వయం చేసేందుకు 'సత్యాగ్రహ' కార్యక్రమాన్ని రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. తమ సమస్యలు, పోరాటాలకు సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశిత ఫారం నింపడం ద్వారా ఉద్యమకారులు తమ గళాన్ని జాతీయ స్థాయిలో వినిపించేందుకు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "మీ గళాన్ని మేం వింటాం, మీతో కనెక్ట్ అవుతాం. సత్యం, న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ఉంటుంది. 'సత్యాగ్రహ' వెబ్‌సైట్‌ను సందర్శించి మీ ఉద్యమ వివరాలను నమోదు చేయండి" అని ఆయన పిలుపునిచ్చారు. వివిధ ప్రాంతాల్లో విడివిడిగా జరుగుతున్న స్థానిక ఉద్యమాలకు జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టి, వాటిని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

# అన్ని ఎన్నికలు రద్దు!

**మొదటి పేజీ తరువాయి**

అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టు బౌండరీ వాల్‌కు టెండర్ ఖరారు

**ప్రహరీ నిర్మాణానికి టెండర్ ఖరారు చేసిన ఏఏఐ**

**రూ.13.28 కోట్లకే పనులు దక్కించుకున్న సైదాక్స్ ఇన్ఫ్రా**

వరంగల్, అక్టోబర్ 3 (ఈవార్తలు): వరంగల్ (మామనూరు) ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల్లో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మొదటి దశ పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి కాంట్రాక్టు సంస్థను ఖరారు చేసింది. ఎయిర్‌పోర్టుకు కొత్తగా సేకరించిన భూమికి రక్షణ గోడ (బౌండరీ వాల్) నిర్మించే పనులను హైదరాబాద్‌కు చెందిన సైదాక్స్ ఇంజనీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ కాంట్రాక్టును సెప్టెంబర్ 29న ఖరారు చేశారు. ఈ పనుల కోసం ఏఏఐ రూ.21.39 కోట్లను అంచనా వ్యయంగా నిర్ణయించగా, సైదాక్స్ సంస్థ కేవలం రూ.13.28 కోట్లకే పనులు పూర్తి చేస్తామని బిడ్ దాఖలు చేసింది. ఇది అంచనా వ్యయం కంటే 37.89 శాతం తక్కువ. దీనివల్ల ప్రభుత్వానికి దాదాపు రూ.8.10 కోట్లు ఆదా కానుంది. కాంట్రాక్టు ప్రకారం, కొత్తగా సేకరించిన 283 ఎకరాల భూమి చుట్టూ ప్రీకాస్ట్ బౌండరీ వాల్ నిర్మించడంతో పాటు, పాత ప్రహరీ ఎత్తును కూడా పెంచనున్నారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నిబంధనలకు అనుగుణంగా ఈ పనులు జరుగుతాయి. అక్టోబర్ 9న పనులు ప్రారంభించి, 15 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం, అక్టోబర్ 14లోపు సైదాక్స్ కంపెనీ ప్రతినిధులు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులోని ఏఏఐ కార్యాలయంలో అధికారిక ఒప్పందంపై సంతకాలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం రూ.285 కోట్లతో భూసేకరణ పూర్తి చేసి ఏఏఐకి అప్పగించిన విషయం తెలిసిందే. ప్రహరీ పనుల తర్వాత టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ వంటి ఇతర ముఖ్యమైన నిర్మాణాలకు కూడా టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. 2028 జూన్ నాటికి ఎయిర్‌పోర్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.




## నాలుగోసారి అధికారం కోసమే ఓట్ల తొలగింపు: వీహెచ్



హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): కేంద్రంలో నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ద్వారా ఈ కుట్రను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని (ఈసీ) తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగింపజేస్తున్నారని వీహెచ్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి, కొత్త రాజ్యాంగాన్ని అమలు చేయాలనే దురుద్దేశంతోనే ఇదంతా చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జనాభా గణన జరుగుతున్నా, అందులో ఓబీసీల ప్రస్తావన లేదని దుయ్యబట్టారు. ఈ అంశంపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని వీహెచ్ ప్రకటించారు. రేపు శంషాబాద్‌లో ఓబీసీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి, 'ఓబీసీ గర్జన'ను ఢిల్లీ వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. న్యాయం కోసం పోరాడేందుకు ఇదే చివరి అవకాశమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కేంద్రం ఓబీసీ గణన చేపట్టేవరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.



## ఉద్యోగ నియామకాల్లో హైదరాబాద్ టాప్

**సెప్టెంబర్‌లో 9 శాతం వృద్ధి నమోదు**

హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): దేశంలోని ఇతర ప్రధాన మెట్రో నగరాల కంటే 'వైట్ కాలర్' (ఆఫీస్) ఉద్యోగ నియామకాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ జాబ్ పోర్టల్ 'నౌకరి.కామ్' విడుదల చేసిన తాజా 'జాబ్‌స్పీక్' నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఈ సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో నియామకాలు 9 శాతం వృద్ధిని సాధించాయి. ఇదే సమయంలో జాతీయస్థాయిలో నియామకాల వృద్ధి కేవలం 2 శాతంగానే నమోదవడం గమనార్హం. నౌకరి నివేదిక ప్రకారం, హైదరాబాద్ (9%) తర్వాత చెన్నై (6%), బెంగళూరు (4%), కోల్‌కతా (4%) నగరాలు సానుకూల వృద్ధిని కనబరిచాయి. పుణెలో నియామకాలు స్థిరంగా కొనసాగుతుండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు దేశ రాజధాని ప్రాంతం (ఢిల్లీ-ఎన్‌సీఆర్)లో ఉద్యోగ అవకాశాలు 6 శాతం మేర క్షీణించాయి. రంగాల వారీగా విశ్లేషిస్తే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) విభాగాల్లో అత్యధికంగా 20 శాతం వృద్ధి నమోదైంది. పండుగల సీజన్ డిమాండ్, ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ నేపథ్యంలో ఆటోమొబైల్ రంగం 11 శాతం వృద్ధిని సాధించింది. అయితే, ఐటీ-సాఫ్ట్‌వేర్ (-4%), ఫార్మా (-4%), హాస్పిటాలిటీ (-11%), విద్యా రంగం (-18%) వంటి కీలక రంగాల్లో నియామకాలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత నియామకాల్లో కంపెనీలు అనుభవజ్ఞులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. 13-16 ఏళ్ల మధ్య అనుభవం ఉన్నవారికి డిమాండ్ 7 శాతం పెరగ్గా, ఫ్రెషర్ల నియామకాలు కేవలం ఒక శాతం మాత్రమే వృద్ధి చెందాయి. ఇక 4-7 ఏళ్ల అనుభవం ఉన్న మిడ్-లెవల్ విభాగంలో నియమకాలు 2 శాతం మేర క్షీణించాయి.

## శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

తిరుపతి, అక్టోబర్ 3 (ఈవార్తలు): తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో శనివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో విషాదం నెలకొంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, శ్రీసిటీలోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో ఉన్న వాటర్ బాయిలర్ శనివారం ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ పేలుడు ధాటికి ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ వారు కన్నుమూశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో

# ఏపీకి 23 ఐఐటీల టెక్నాలజీ

**చంద్రబాబు సమక్షంలో డిక్లరేషన్**




అమరావతి, అక్టోబర్ 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, సాంకేతిక ప్రగతికి ఊతమిచ్చేలా దేశంలోని 23 ఐఐటీలు ముందుకొచ్చాయి. రాష్ట్రానికి అవసరమైన టెక్నాలజీని బదిలీ చేసేందుకు సంపూర్ణ అంగీకారం తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో 'పాన్ ఐఐటీ ఏపీ 2026' సదస్సులో ఒక చారిత్రక డిక్లరేషన్‌ను విడుదల చేశాయి. అమరావతిని గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్ హబ్‌గా మార్చే లక్ష్యంతో విజయవాడలో జరిగిన ఈ సదస్సులో తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకు మైలురాయిగా నిలవనుంది. శనివారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన ఈ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటనలు చేశారు. అమరావతిలో 'పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్' ఏర్పాటు చేస్తున్నట్లు, డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా రూ.500 కోట్లతో 'పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100 మంది ఐఐటీయన్లతో ఒక గ్లోబల్ మెంటర్ల నెట్‌వర్క్‌ను కూడా ఏర్పాటు చేసి ఏపీలోని స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా క్యూ-శివ పేరుతో రూపొందించిన ఐదు మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్లను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్, చండీగఢ్ యూనివర్సిటీ సహకారంతో రూపొందించిన ఈ కంప్యూటర్లతో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్‌ను కూడా ఆవిష్కరించారు. 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌ను సృష్టించేలా క్వాంటం కంప్యూటర్ల తయారీకి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలో డీప్‌టెక్ ఉత్పత్తుల తయారీ సామర్థ్యానికి నిదర్శనమని సీఎం అన్నారు. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కాంపోనెంట్లు మచిలీపట్నంలోనే లభిస్తున్నాయని క్యూబిట్ సంస్థ సీఈఓ వివరించడం గమనార్హం. దేశ నిర్మాణంలో ఐఐటీయన్ల పాత్ర కీలకమని, వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు వారి మేధస్సును వినియోగించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "ఇప్పటివరకు సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడుకున్నాం. ఇకపై ప్రపంచం అమరావతి క్వాంటం వ్యాలీ గురించి మాట్లాడుకుంటుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతిలో ఐబీఎం-టీసీఎస్-ఎల్అండ్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను, వాటి పరికరాలను ఇక్కడే తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఏపీ ఎదగాలని ఆకాంక్షించారు.

# అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు



హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఆదివారం ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా శనివారం రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# కాంగ్రెస్ శకం ముగిసింది: హరీశ్ రావు



నర్సాపూర్, అక్టోబర్ 3 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

# నా పోటీ హుజూర్‌నగర్ నుంచే

**వదంతులు నమ్మొద్దు: మంత్రి ఉత్తమ్**



హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## తిరుమలకు పోటెత్తిన భక్తులు

తిరుమల, అక్టోబర్ 3 (ఈవార్తలు): పెరటాసి మాసం మూడో శనివారం సందర్భంగా కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ మాసంలో, ముఖ్యంగా శనివారం నాడు స్వామివారిని దర్శించుకునేందుకు తమిళనాడుతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో తిరుమల గిరులు భక్తజన సంద్రంగా మారాయి. శనివారం ఉదయం నాటికి శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించిన అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 30 గంటలకు పైగా సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు అంచనా వేస్తున్నారు. పెరటాసి మాసం విష్ణుమూర్తి ఆరాధనకు ఎంతో పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ మాసంలోని శనివారాల్లో శ్రీవారిని దర్శించుకుంటే విశేష ఫలాలు దక్కుతాయని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఈ నమ్మకంతోనే ప్రతీయేటా ఈ సమయంలో తిరుమలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. కాగా, శుక్రవారం (అక్టోబర్ 2) నాడు 78,445 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,098 మంది తలనీలాలు సమర్పించుకోగా, హుండీ ద్వారా రూ. 4.30 కోట్ల కానుకలు సమకూరాయి. అదేవిధంగా, 4.16 లక్షల లడ్డూలు విక్రయించగా, 3.30 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అశ్విని ఆసుపత్రిలో 4,818 మంది వైద్య సేవలు పొందారు. ఈ గణాంకాలు తిరుమలలో భక్తుల రద్దీ ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో ఉన్నవారికి నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు అందిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భక్తులు సంయమనంతో వ్యవహరించి టీటీడీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అమరావతి ఓఆర్ఆర్.. రూ.11,537 కోట్లతో పనులు

అమరావతి, అక్టోబర్ 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాల చుట్టూ నిర్మించ తలపెట్టిన అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఈ భారీ ప్రాజెక్టు పనుల కోసం నాలుగు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది. మొత్తం రూ.11,537.70 కోట్ల అంచనా వ్యయంతో సివిల్ పనులను చేపట్టనున్నారు. శుక్రవారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 195.13 కిలోమీటర్ల పొడవున ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందులో 189.93 కి.మీ. ఆరు వరుసల ఓఆర్ఆర్ కాగా, నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు 5.2 కి.మీ. నాలుగు వరుసల అనుసంధాన రహదారి కూడా ఉంది. నవంబర్ 18 వరకు బిడ్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించగా, 19న టెక్నికల్ బిడ్లను తెరవనున్నారు. కేంద్ర కమిటీల నుంచి తుది అనుమతులు త్వరలో రానున్నాయన్న అంచనాతో ఎన్‌హెచ్ఏఐ ముందుగానే టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్

# నేడు అశోక్ సింగాల్ శతజయంతి వేడుకలు

**కర్మన్‌ఘాట్ ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహణ**

**ముఖ్య అతిథులుగా వెంకయ్య నాయుడు, చంపత్ రాయ్**

**భారీగా తరలిరావాలని వీహెచ్‌పీ నేత బాలస్వామి పిలుపు**

హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అగ్రనేత, దివంగత అశోక్ సింగాల్ శతజయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ తెలంగాణ ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తెలిపారు. వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 4న ఆదివారం సాయంత్రం 4 గంటలకు కర్మన్‌ఘాట్ సమీపంలోని ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, వీహెచ్‌పీ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చంపత్ రాయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు బాలస్వామి వెల్లడించారు. హిందూ సమాజ సంఘటితం, ధార్మిక చైతన్యం, అయోధ్య శ్రీరామ జన్మభూమి ఉద్యమంలో అశోక్ సింగాల్ పోషించిన పాత్రను స్మరించుకుంటూ ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అశోక్ సింగాల్ శతజయంతి ఉత్సవాలు 2026 సెప్టెంబర్ 27 నుంచి 2027 సెప్టెంబర్ 27 వరకు ఏడాది పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కరసేవకులు, స్వయంసేవకులు, ధర్మాచార్యులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బాలస్వామి విజ్ఞప్తి చేశారు.






# సనత్‌నగర్ టిమ్స్‌లో భారీ చోరీ!

**వైద్య పరికరాల అపహరణపై పరిశీలనకు**

**వెళ్తుండగా బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు**

హైదరాబాద్, అక్టోబర్ 3 (ఈవార్తలు): సనత్‌నగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆసుపత్రిలో లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలు అపహరణకు గురైన ఘటనపై వాస్తవాలు తెలుసుకునేందుకు ఆసుపత్రిని సందర్శించనున్నారన్న సమాచారంతో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాగంటి సునీత గోపీనాథ్ అనుచరులు, సీనియర్ నాయకులు నవీన్ పటేల్, చంద్రశేఖర్, నాగరాజు, ఫాహీమ్, జహీర్‌లను అదుపులోకి తీసుకుని మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ పటేల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తమను నిర్బంధించారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలను ప్రజల ముందుకు తీసుకువస్తూనే ఉంటామని, ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుతామని అన్నారు.



# అక్రమ ఇసుక లారీ పట్టివేత

**పాత రసీదుతో ఇసుక రవాణా**

**డ్రైవర్, యజమానిపై కేసు**

జగిత్యాల, అక్టోబర్ 3 (ఈవార్తలు) : పులాస గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని జగిత్యాల రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టిన పోలీసులు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. డ్రైవర్ వద్ద చెల్లుబాటు అయ్యే ప్రభుత్వ రసీదు, అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో డ్రైవర్ పానుగంటి రాజశేఖర్ (30) మంచిర్యాల జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గతంలో ఉపయోగించిన ప్రభుత్వ రసీదును తిరిగి ఉపయోగిస్తూ ఇసుకను రవాణా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. దీంతో లారీ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమాసాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెల్లుబాటు అయ్యే ప్రభుత్వ రసీదు, అనుమతులు ఉన్నప్పుడే ఇసుక రవాణా చేయాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.



# పోరుమల్ల పీఏసీఎస్ పాలకవర్గం ఏర్పాటు

మేడిపెల్లి, అక్టోబర్ 3 (ఈవార్తలు) : జగిత్యాల జిల్లా మేడిపెల్లి మండలం పోరు మల్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాల కవర్గం శనివారం ఏర్పాటైంది. నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు నూతన పాలకవర్గాన్ని నియమించారు. చైర్‌పర్సన్‌గా చిట్యాల శ్రీనివాస్ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా సవనపల్లి సంజీవ్, దుబ్బ లక్ష్మి, కొలిపాక గంగరాజం, కొంక రాజయ్య, బేతి నారాయణ, కలగిరి భూమారెడ్డి, కట్కం శ్రీనివాస్, జంగా లక్ష్మణ్, ఇదురి పెద్ద లింబాద్రి, పరిపెల్లి జలపతి, అలేటి రాధమ్మ నియమితులయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి ప్రణయ్ పాల్గొన్నారు.

# మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టండి: వైఎస్ జగన్

హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్లంటూ చంద్రబాబు చేసిన ప్రకటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పిట్టలదొర మాటలు మానుకోవాలని సూచించారు. చంద్రబాబు డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టాలని అన్నారు. రూ. లక్ష కోట్లు కాదని, రైతులకు లక్ష మోసాలు అంటూ ట్వీట్ చేశారు. “చంద్రబాబూ.. రాయలసీమలో హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్లు అంటూ మీరు చేస్తున్నవి డ్రామాలు, అంకెలగారడీలు కాక మరేమిటి? బడ్జెట్లో కేటాయింపులు లేకుండా, ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా, రైతుల్ని ఇంతలా మభ్యపెట్టడం మీకు మాత్రమే సాధ్యం. రైతుల మీద మీ ప్రేమ, మాటలకు, ప్రచారాలకు మాత్రమే పరిమితం అని రెండున్నరేళ్ల మీ పాలనే పలుమార్లు రుజువు చేసింది. హార్టికల్చర్ సహా పంటలకు ధరల్లేక రైతులు రోడ్డున పడితే రోజూ ధర్నాలు చేస్తే మీరు ఏరోజైనా పట్టించుకున్నారా?” అని వైఎస్ జగన్ అన్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టిన ధరల స్థిరీకరణ నిధిని నిర్వీర్యంచేసి, ఉచిత పంటల బీమాను తీసివేసి రైతుల వెన్ను విరిచిన మాట వాస్తవం కాదా? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. “సున్నా వడ్డీ పథకాన్ని రద్దుచేసి, సమయానికి ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీని నిర్వీర్యంచేసి, రైతుల నడ్డివిరిచారు. మీరు పబ్లిసిటీ డ్రామాలు చేసి, వాటినే నిజాలుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తారు తప్ప, రైతుల కష్టసుఖాల గురించి ఏరోజూ పట్టించుకోరనడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలి? తీవ్రమైన కరువు కారణంగా రాయలసీమలో ఇప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొంటే, వేలాది ఎకరాల్లో హార్టికల్చర్ తోటలు ఎండిపోతుంటే, మీరు వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.



# ఎమ్మెల్యే సంజయ్ హౌస్ అరెస్ట్

**టిమ్స్ ఆసుపత్రి సందర్శనకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు**

**బీఆర్ఎస్ నేతల నిర్బంధంపై పార్టీ శ్రేణుల ప్రశ్న**

జగిత్యాల, అక్టోబర్ 3 (ఈవార్తలు) : సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రి సందర్శనకు వెళ్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. పేద ప్రజల కోసం గత ప్రభుత్వం నిర్మించిన ఆసుపత్రిలో వసతులను పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేను అడ్డుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వసతులు, సమస్యలను పరిశీలించేందుకు వెళ్తే అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులను హౌస్ అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకోవడం ఎందుకని పార్టీ శ్రేణులు ప్రశ్నించాయి. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు చేపట్టే పర్యటనలను అడ్డుకోవడం తగదని పేర్కొన్నారు.

# విద్యుత్ ఉద్యోగిపై దాడి

జగిత్యాల, అక్టోబర్ 3 (ఈవార్తలు) : సారంగాపూర్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ ఫణి చంద్రశేఖర్‌పై శుక్రవారం అర్ధరాత్రి దాడి జరిగింది. అదే ప్రాంతానికి చెందిన పల్లెపు రాజు కర్రతో దాడి చేయడంతో చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. సిబ్బంది 108 వాహనంలో ఆయనను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సబ్‌స్టేషన్ ఆవరణలో చెత్త వేయడం, బహిర్భూమికి వెళ్లడంపై చంద్రశేఖర్ మందలించడంతో కక్ష పెంచుకున్న రాజు దాడికి పాల్పడినట్లు సిబ్బంది తెలిపారు. ఘటనను విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సారంగాపూర్ ఎస్ఐ గీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్థానికానికి పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి

సాక్షి, తాడేపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు నామినేషన్ నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు అన్ని దశల్లో న్యాయపరమైన అండ అందించేందుకు పార్టీ లీగల్ సెల్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. ఇస్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకునేలా సహకరించాలని సూచించారు.




# రక్తదానంతో ప్రాణదానం

జగిత్యాల, అక్టోబర్ 3 (ఈవార్తలు) : వార్డు నంబర్ 34 కౌన్సిలర్ డాక్టర్ మహమ్మద్ అయ్యూబ్ ఖాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా సేవలో భాగస్వాములయ్యారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, స్వచ్ఛంద రక్తదానం ద్వారా మాత్రమే అవసరమైన వారికి రక్తాన్ని అందించి ప్రాణాలను కాపాడవచ్చని నిర్వాహకులు తెలిపారు. కుల, మత భేదాలు లేకుండా అందరి రక్తం ఒక్కటేనని, రక్తదానం ద్వారా మానవత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇమ్రాన్ ఖురేషి, ఇమ్రాన్ ఖాన్, షాహెజాద్ అలీ, పబ్బు అబ్రార్, సమీర్ హనాన్, జుబైర్ ఖాన్, న్యాయవాది మహమ్మద్ సల్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. పలువురు స్థానిక ప్రముఖులు, యువకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, ముఖ్యంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు.



# నరేందర్‌రెడ్డి కుటుంబానికి బొడిగె శోభ పరామర్శ

గంగాధర, అక్టోబర్ 3 (ఈవార్తలు) : చొప్పదండి నియోజకవర్గం చాకుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గోపు నరేందర్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ హాజరై ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నరేందర్‌రెడ్డి గ్రామ అభివృద్ధికి, ప్రజలకు ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన హఠాన్మరణం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతతో చెలగాటం వద్దు

**రూ.17 కోట్ల రోడ్డు, వంతెన పనుల్లో తీవ్ర జాప్యం**

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి**



జగిత్యాల, అక్టోబర్ 3 (ఈవార్తలు) : జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి నుంచి చల్‌గల్ వరకు కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.17 కోట్లతో చేపడుతున్న రోడ్డు, వంతెన పనుల్లో జాప్యం, నాణ్యత లోపాలపై బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. జగిత్యాల–చల్‌గల్ ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, అలాంటి కీలక మార్గంలో పనులు నత్తనడకన సాగడం సరికాదన్నారు. పెద్దనాల వద్ద వంతెన పనులు ఏప్రిల్‌లో ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ పూర్తికాలేదని తెలిపారు. రహదారి పనులు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆరోపించారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు, చేరువ రహదారులు, రాత్రివేళల్లో కనిపించే సూచికలు ఏర్పాటు చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పెద్దనాల వద్ద ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయని, ప్రజల భద్రతతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగితే అధికారులు, కాంట్రాక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కశెట్టి తిరుపతి, కౌన్సిలర్లు వేముల శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, జిల్లా కార్యదర్శి పాత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను విస్మరిస్తున్న కాంగ్రెస్

**బీఆర్ఎస్ హయాంలో సంక్షేమానికి పెద్దపీట**

**ఎమ్మెల్సీ ఎల్. రమణ**




జగిత్యాల, అక్టోబర్ 3 (ఈవార్తలు) : బీసీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎల్. రమణ అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ బీసీ సెల్ సమావేశం శనివారం ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రమణతోపాటు పల్లె రవికుమార్‌గౌడ్, బాలరాజ్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో బీసీ వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా అవకాశాలు కల్పించామని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీసీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, బీసీ సెల్ ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# ప్రమాదంలో ప్రపంచ ఆర్థికం

**అంతా బాగుందనుకుంటే ప్రమాదమే**

**ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా వార్నింగ్**

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

# ‘బిట్‌చాట్’ యాప్‌పై నిషేధం




న్యూఢిల్లీ: ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సీకి భారత ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఆయన కొత్తగా రూపొందించిన ‘బిట్‌చాట్’ అనే మెసేజింగ్ అప్లికేషన్‌ను ఇండియాలోని యాపిల్ యాప్ స్టోర్ నుంచి తొలగించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని జాక్ డోర్సీ శనివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో స్వయంగా వెల్లడించారు. భారత ప్రభుత్వం తమ యాప్‌ను అధికారికంగా యాప్ స్టోర్ నుంచి తొలగించిందని డోర్సీ పేర్కొన్నారు. ఇందుకు ఆధారంగా యాపిల్ సంస్థ తనకు పంపిన ఈ-మెయిల్ స్క్రీన్‌షాట్‌ను కూడా ఆయన పంచుకున్నారు. భారత చట్టాల ప్రకారం యాప్‌లో చట్టవిరుద్ధమైన కంటెంట్ ఉందని ఆరోపిస్తూ, ఐటీ చట్టం 2000లోని సెక్షన్ 69ఏ కింద ఈ తొలగింపు ఉత్తర్వులు జారీ అయినట్లు యాపిల్ తన నోటీసులో పేర్కొంది. తమ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉండే యాప్‌లు అన్ని దేశాల్లోని స్థానిక చట్టాలకు కచ్చితంగా కట్టుబడి ఉండాలని, లేనిపక్షంలో వాటిని తొలగించాల్సి వస్తుందని యాపిల్ స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఈ యాప్‌ను కేవలం ఇండియా యాప్ స్టోర్ నుంచి మాత్రమే తొలగించామని, డెవలపర్ ఎంచుకున్న ఇతర దేశాల్లో ఇది అందుబాటులో ఉంటుందని తెలిపింది. అలాగే, యాప్ బీటా వెర్షన్లు కూడా టెస్ట్‌ఫ్లైట్ ద్వారా భారత్‌లో పనిచేయవని పేర్కొంది. ఈ విషయంపై మరింత సమాచారం కావాలంటే నేరుగా భారత ప్రభుత్వాన్ని సంప్రదించాలని డోర్సీకి యాపిల్ సూచించింది.

# కెప్టెన్ స్మిత్‌కు దుబాయ్ యువరాజు పరామర్శ

దుబాయ్: ప్రాణాలను లెక్కచేయకుండా విమానంలోని 174 మందిని కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. దుబాయ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్మిత్‌ను కలిసిన అనంతరం యువరాజు ఆయన ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్మిత్‌పై తమకు పూర్తి గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు. యూఏఈ నాయకత్వం కూడా ఆయనను గర్వంగా చూస్తోందని చెప్పారు. స్మిత్ యూఏఈ విలువలకు ప్రతీకగా నిలిచారని యువరాజు పేర్కొన్నారు. దయ, శాంతి, మానవ ప్రాణాలకు విలువ ఇచ్చే దేశంగా యూఏఈ నిలుస్తుందని చెప్పారు. స్మిత్‌తో మాట్లాడుతున్న ఫొటోలను యువరాజు సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న దృశ్యాలు కూడా అందులో కనిపించాయి. విమానంలో సహ పైలట్ దాడి చేయడంతో స్మిత్ తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన సహ పైలట్‌ను అడ్డుకునేందుకు ఆయన గాయాలతో వీరోచితంగా పోరాడారు. అనంతరం కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో విమానంలోని 174 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడటంలో స్మిత్ కీలక పాత్ర పోషించారు. తీవ్ర గాయాల మధ్య కూడా ఆయన చూపిన ధైర్యంపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి.

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు ఎక్కువే: ఎస్పీ

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు.

# 114 రఫేల్.. 3.25 లక్షల కోట్ల డీల్




**ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఒప్పందం ఖరారు**

న్యూఢిల్లీ: భారత వాయుసేనను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక అడుగులు వేస్తోంది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 114 బహుళ ప్రయోజన యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన మెగా ఒప్పందాన్ని ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఖరారు చేసే అవకాశం ఉందని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వెల్లడించారు. ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, ఇది దేశ రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్ద కొనుగోలు ఒప్పందంగా నిలుస్తుంది. ఫ్రాన్స్‌తో ప్రభుత్వాల మధ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఈ డీల్‌ను ఖరారు చేయనున్నారు. ఈ ఒప్పందం పూర్తయితే, ఇప్పటికే భారత వాయుసేన వద్ద ఉన్న 36 రఫేల్, నౌకాదళం కోసం ఆర్డర్ చేసిన 26 రఫేల్-ఎం జెట్‌లతో కలిపి మొత్తం రఫేల్ విమానాల సంఖ్య 176కి చేరుతుంది. ప్రస్తుతం ఈ భారీ ఒప్పందానికి సంబంధించి ధరల వివరాలు, ఇతర కీలక అంశాలపై చర్చలు జరుగుతున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ తెలిపారు. వాయుసేనలో తగ్గిపోతున్న ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య ఆందోళన కలిగిస్తోందని, ఈ నేపథ్యంలో రాబోయే కొన్నేళ్లలో ఏటా కనీసం 36 నుంచి 40 విమానాలు అవసరమని ఏపీ సింగ్ స్పష్టం చేశారు. దేశ సైనిక శక్తిలో వాయుసేన సామర్థ్యం అత్యంత కీలకమని, అందుకే దాన్ని నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను వివరిస్తూ, దేశీయంగానే ఫైటర్ జెట్ ఇంజన్‌ను తయారు చేయాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు. “మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సైనిక శక్తిగా మారాలి. యుద్ధ సన్నద్ధతకు స్వావలంబన చాలా ముఖ్యం” అని ఆయన అన్నారు. ఒకవేళ దేశీయంగా అభివృద్ధి చేస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్యక్రమంలో జాప్యం జరిగితే, ప్రత్యామ్నాయంగా ఇతర విమానాలను పరిశీలించే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. “రష్యా మాకు ఎస్‌యూ-57 (స్టెల్త్) జెట్లను ఆఫర్ చేసింది, కానీ దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు” అని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇటీవల రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, ఈ రఫేల్ ఒప్పందం ద్వారా దేశంలో రెండో ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి వీలవుతుందని, తద్వారా రక్షణ ఉత్పత్తుల స్వదేశీకరణకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రఫేల్ డీల్‌తో పాటే, దేశీయంగా అభివృద్ధి చేసిన తేజస్ మార్క్ 1ఏ కార్యక్రమం కూడా కొనసాగుతుందని, ప్రపంచ స్థాయి రాడార్లు, ఆయుధాలను అమర్చుతూ దాన్ని మరింత మెరుగుపరుస్తామని ఆయన స్పష్టం చేశారు.

# రష్యా-ఉక్రెయిన్ వార్.. పెద్దన్నగా భారత్

**యుద్ధం ముగింపు దిశగా కీలక అడుగు.. మోదీ ప్రతిపాదనపై ఉక్రెయిన్ ప్రశంసలు**



కీవ్/న్యూఢిల్లీ:రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు దౌత్య ప్రయత్నాలు మరోసారి ఊపందుకున్నాయి. ఈసారి భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ నుంచి కీలక స్పందన వచ్చింది. కాల్పుల విరమణ కోసం తమకు నాలుగు ప్రతిపాదనలు అందాయని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహా తెలిపారు. భారత్, అమెరికా, టర్కీ, ఈజిప్ట్ నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో.. భారత్ ప్రతిపాదన అత్యంత సమగ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్ ప్రతిపాదన వివరాలను పూర్తిగా బయటపెట్టలేదు. అయితే ఉక్రెయిన్ ప్రకారం.. ఇంధన రంగంతో పాటు నల్ల సముద్రంలో కాల్పుల విరమణకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంధన కేంద్రాలు, ఓడరేవులపై దాడులు నిలిపివేయడం కూడా కీలక అంశంగా ఉంది. నల్ల సముద్రంలో నౌకాయానం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సజావుగా సాగేందుకు ఇది ఉపయోగపడే అవకాశం ఉంది. రష్యా-ఉక్రెయిన్ కాల్పుల విరమణ కోసం ప్రస్తుతం నాలుగు దౌత్య ప్రతిపాదనలు చర్చల్లో ఉన్నాయి. టర్కీ, ఈజిప్ట్ కలిసి నల్ల సముద్రంలో ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలు కల్పించే సంధిని ప్రతిపాదించాయి. అమెరికా ఇంధన మౌలిక వసతులపై దాడులు నిలిపివేయడంపై దృష్టి పెట్టింది. భారత్ ప్రతిపాదన మాత్రం ఇంధన రంగం, నల్ల సముద్రం అంశాలను కలిపి చూస్తోంది. కాల్పుల విరమణలో ఇంధన రంగం, నల్ల సముద్రం రెండూ కలిసే ఉండాలని ఉక్రెయిన్ కోరుతోంది. ఓడరేవులు సహా అన్ని ఇంధన మౌలిక వసతులపై దాడులు పూర్తిగా ఆగాలని సిబిహా స్పష్టం చేశారు. అదే సమయంలో యుద్ధ ప్రాంతం వెంట షరతులు లేని కాల్పుల విరమణను కూడా పరిశీలించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ పరిణామాల మధ్య రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ప్రధాని నరేంద్ర మోదీ శాంతి ప్రయత్నాలను ప్రశంసించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశాన్ని మోదీ పదేపదే ప్రస్తావిస్తున్నారని ఇటీవల ఓ కార్యక్రమంలో చెప్పారు. ఇరువైపులా ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం మోదీకి మంచి ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్నారు. శాంతియుతంగా, త్వరగా సమస్య పరిష్కారం కావాలని మోదీ కోరుతున్నారని పుతిన్ అన్నారు. భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ సానుకూలంగా స్పందించినా.. కాల్పుల విరమణ అమలుకు రష్యా అంగీకారం కూడా కీలకం. ప్రస్తుతం నాలుగు ప్రతిపాదనలపై చర్చలు కొనసాగుతున్నాయి. వాటిలో ఏది ఆచరణలోకి వస్తుందన్నది రాబోయే దౌత్య చర్చలపై ఆధారపడి ఉంటుంది.




# ఫ్లైదుబాయ్ దాడి ఉగ్రవాద చర్యే

**స్పష్టం చేసిన యూఏఈ ప్రాసిక్యూటర్లు**

దుబాయ్: సంచలనం సృష్టించిన ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న విమానంలో భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై సహ పైలట్ (కో-పైలట్) హమామ్ అల్ హమామీ జరిపిన దాడి ఒక “ఉగ్రవాద చర్య” అని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రాసిక్యూటర్లు శనివారం ధృవీకరించారు. విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకుని, దాన్ని కూల్చివేసేందుకు కో-పైలట్ కుట్ర పన్నినట్లు అధికారులు వెల్లడించారు. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ బోయింగ్ 737 విమానం గాల్లో ఉండగా ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. విమానం సుమారు 34,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో, కో-పైలట్ హమామ్ అల్ హమామీ తన ఉగ్ర ప్రణాళికను అమలు చేసేందుకు సిద్ధమయ్యాడు. కాక్‌పిట్‌లో ఉన్న ‘క్రాష్ యాక్స్’ (విపత్కర పరిస్థితుల్లో వాడే గొడ్డలి) తీసుకుని కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి తెగబడ్డాడు. ఆ సమయంలో విమానం నియంత్రణ కోల్పోయి నిమిషానికి 23,000 అడుగుల వేగంతో కిందకి పడిపోవడం ప్రారంభించింది. క్షణాల్లో 15,600 అడుగుల ఎత్తుకు చేరుకుంది. అయితే, ప్రాణాపాయ స్థితిలోనూ కెప్టెన్ స్మిత్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. కో-పైలట్‌తో పోరాడుతూనే కాక్‌పిట్ డోర్‌ను తెరిచారు. దీంతో విమాన సిబ్బంది, ప్రయాణికులు వెంటనే స్పందించి కో-పైలట్‌ను పట్టుకుని బంధించారు. ఆ సమయంలో విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు పైలట్ల సహాయంతో కెప్టెన్ స్మిత్ విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ నగరంలో సురక్షితంగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. కెప్టెన్ సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది.

# 2028 నాటికి ఐసీఎఫ్ కోచ్‌లకు వీడ్కోలు

న్యూఢిల్లీ: ప్రయాణికుల భద్రతను పెంచే దిశగా భారతీయ రైల్వే ఓ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నడుస్తున్న మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పాత ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ కోచ్‌లను పూర్తిగా తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027-28 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, వాటి స్థానంలో అధునాతన, సురక్షితమైన లింక్ హాఫ్‌మన్ బుష్ కోచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళికలు రచిస్తోంది. రైల్వే శాఖ నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 2,000 రైళ్లలో ఇప్పటికే 1,600కు పైగా రైళ్లలో ఐసీఎఫ్ కోచ్‌లను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో భర్తీ చేశారు. మిగిలి ఉన్న 340 నుంచి 350 రైళ్లలో కూడా ఈ మార్పును వేగవంతం చేయనున్నారు. రాబోయే రెండేళ్లలో, అంటే 2027, 2028 ఆర్థిక సంవత్సరాల్లో ఏటా 170-180 రైళ్ల చొప్పున పాత కోచ్‌లను మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఐసీఎఫ్ కోచ్‌లను తొలగించడానికి ప్రధాన కారణం భద్రతాపరమైన లోపాలే. ఈ పాత కోచ్‌లు ప్రమాదాలకు గురైనప్పుడు ఒకదానికొకటి గుద్దుకుని, ఒకదానిపై ఒకటి ఎక్కే (టెలిస్కోపింగ్) ప్రమాదం ఎక్కువగా ఉంది. దీనివల్ల ప్రాణనష్టం అధికంగా సంభవిస్తుంది. ఈ సమస్యను అధిగమించేందుకే రైల్వే శాఖ 2018లోనే ఐసీఎఫ్ కోచ్‌ల తయారీని నిలిపివేసింది. ఐసీఎఫ్ కోచ్‌ల మార్పిడి పూర్తయ్యాక, రైల్వే శాఖ కొత్త రైళ్ల తయారీలో మరో ముందడుగు వేయనుంది. భవిష్యత్తులో మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లను ‘అమృత్ భారత్’ ప్లాట్‌ఫామ్ ఆధారంగా, పుష్-పుల్ టెక్నాలజీతో నిర్మించనున్నారు. ఈ రైళ్లకు రెండు వైపులా ఇంజిన్లు ఉండటం వల్ల, రైలు ప్రారంభమయ్యేటప్పుడు కుదుపులు లేకుండా సాఫీగా కదులుతుంది. అలాగే, అధిక వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు కూడా మెరుగైన భద్రతను అందించేలా సెమీ-రిజిడ్ కప్లర్లను వినియోగిస్తారు. అయితే, కొన్ని ఐసీఎఫ్ కోచ్‌లను ప్రత్యేక రైళ్లు, డిమాండ్‌పై నడిపే రైళ్లు, రైల్వే శాఖ అంతర్గత అవసరాల కోసం వినియోగించనున్నారు. తుప్పు పట్టిన కోచ్‌లను త్వరగా స్క్రాప్‌కు పంపేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు. ఇకపై తయారు చేసే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను కూడా పుష్-పుల్ టెక్నాలజీకి అనువుగా నిర్మించాలని ఉత్పత్తి యూనిట్లకు రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది.

# కొత్త టీఎఫ్‌టీ స్క్రీన్‌తో బజాజ్ పల్సర్ ఎన్‌ఎస్400జెడ్

ముంబై: బజాజ్ ఆటో సంస్థ తన అప్‌డేటెడ్ పల్సర్ ఎన్‌ఎస్400జెడ్ బైక్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. కొత్త 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లేతో ఈ బైక్‌ను అప్‌డేట్ చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.1,90,015గా నిర్ణయించింది. ఇప్పటివరకు ఉన్న కలర్ ఎల్‌సీడీ స్క్రీన్ స్థానంలో కొత్త టీఎఫ్‌టీ డిస్‌ప్లే వచ్చింది.




ఇందులో గూగుల్ మ్యాప్స్ మిర్రరింగ్ సదుపాయం ఉంది. టర్న్-బై-టర్న్ నావిగేషన్, మ్యూజిక్ కంట్రోల్స్, డాక్యుమెంట్ స్టోరేజ్, ల్యాప్ టైమర్ వంటి ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. రైడర్లు నాలుగు రైడింగ్ మోడ్‌లను డిస్‌ప్లే ద్వారానే మార్చుకోవచ్చు. ట్రాక్షన్ కంట్రోల్‌ను కూడా నియంత్రించవచ్చు. బ్లూటూత్ ద్వారా ఫోన్‌ను బైక్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. దీంతో పాటు యూఎస్‌బీ టైప్-సి ఛార్జింగ్ పోర్టును కూడా ఇచ్చారు. హార్డ్ బ్రేకింగ్ సమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలను అప్రమత్తం చేసేందుకు ‘పానిక్ బ్రేక్ అలర్ట్’ సిస్టమ్‌ను కూడా జోడించారు. బైక్ ఒక్కసారిగా గట్టిగా బ్రేక్ వేస్తే హజార్డ్ లైట్లు వెలుగుతాయి. కొత్త టీఎఫ్‌టీ డిస్‌ప్లేను బజాజ్ ఈ ఏడాది పల్సర్ సిరీస్‌లో క్రమంగా తీసుకొస్తోంది. ఎన్160 ఎస్ఎస్, పల్సర్ 125, పల్సర్ 150 తర్వాత ఇప్పుడు ఎన్‌ఎస్400జెడ్‌లోనూ ఈ ఫీచర్‌ను అందించింది. బైక్ ఇంజిన్‌లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. 349 సీసీ సింగిల్ సిలిండర్ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ 40 హెచ్‌పీ శక్తిని, 33 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఇచ్చారు. 43 మి.మీ. యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్, డ్యూయల్ ఛానల్ ఏబీఎస్, రేడియల్ టైర్లు, ఎలక్ట్రానిక్ థ్రాటిల్ బాడీ వంటి ఫీచర్లు కొనసాగుతున్నాయి.

# అమెరికాలో హిందూ ఆలయంపై దాడి

**ఇటుకలతో ధ్వంసం చేసిన దుండగులు**

**దాడిని ఖండించిన హిందూ సంస్థలు**



క్లీవ్‌లాండ్: అమెరికాలోని ఓ హిందూ ఆలయంపై దుండగులు దాడికి పాల్పడ్డారు. ఒహాయో రాష్ట్రంలోని గ్రేటర్ క్లీవ్‌ల్యాండ్ ప్రాంతంలో ఉన్న శ్రీ స్వామినారాయణ్ హిందూ టెంపుల్ వడ్తాళ్‌ధామ్‌పై శుక్రవారం మధ్యాహ్నం ఇటుకలతో దాడి చేశారు. ఆలయ భవనానికి నష్టం వాటిల్లింది. కిటికీలు ధ్వంసమయ్యాయి. ఘటన జరిగిన సమయంలో ఆలయంలో పూజారులు, కొందరు భక్తులు ఉన్నారు. అయితే ఎవరికైనా గాయాలయ్యాయా? లేదా? అన్నది స్పష్టంగా తెలియలేదు. ఈ ఘటనపై ‘ఉత్తర అమెరికా హిందువుల సంఘం’ ఆందోళన వ్యక్తం చేసింది. రిచ్‌మండ్ హైట్స్ మేయర్ కిమ్ థామస్, నగర అధికారులు దాడిని ఖండించాలని కోరింది. నిందితుడిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అమెరికాలోని ‘హిందూ అమెరికన్ ఫౌండేషన్’ (హెచ్ఏఎఫ్) కూడా ఘటనను ఖండించింది. హిందూ అమెరికన్ సమాజంపై విద్వేషపూరిత వ్యాఖ్యలు పెరుగుతున్న సమయంలో ఈ దాడి జరగడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. ఆలయంపై దాడికి పాల్పడిన వ్యక్తిని గుర్తించి చర్యలు తీసుకోవాలని హెచ్ఏఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుహాగ్ శుక్లా కోరారు. మరో పది రోజుల్లో నవరాత్రి ఉత్సవాలతో హిందూ హెరిటేజ్ మంత్ వేడుకలకు భారతీయ-అమెరికన్ సమాజం సిద్ధమవుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అమెరికాలో హిందూ ప్రార్థనా స్థలాలపై దాడులు గతంలోనూ నమోదయ్యాయి. 2022లో న్యూయార్క్‌లోని శ్రీ తులసీ మందిర్‌లో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. 2023లో కాలిఫోర్నియాలోని నెవార్క్‌లో స్వామినారాయణ్ ఆలయంపై గ్రాఫిటీ వేశారు. 2024లో న్యూయార్క్, కాలిఫోర్నియాలోని బీఏపీఎస్ ఆలయాలపైనా దాడులు జరిగినట్లు హిందూ సంస్థలు తెలిపాయి.

వయ్యారి చిత్రం



నియతి ఫత్నానీ



భారత సినీ యవనికపై తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు (94) శనివారం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు.



సింగీతం శ్రీనివాసరావు

# దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత

ఆరు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి, భారతీయ సినిమా గతిని మార్చిన విలక్షణ సృష్టికర్తగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు. సింగీతం శ్రీనివాసరావు ప్రస్థానం 'మాయాబజార్' వంటి క్లాసిక్ చిత్రానికి కె.వి. రెడ్డి వద్ద సహాయకుడిగా ప్రారంభమైంది. ఆ తర్వాత దర్శకుడిగా మారి, భారత చలనచిత్ర చరిత్రలో మర్చిపోలేని చిత్రాలను అందించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రాలలో ప్రయోగాలు ఒక ముఖ్యమైన భాగంగా ఉండేవి. సంభాషణలు లేని బ్లాక్ కామెడీ 'పుష్పక విమానం' (1987), భారతీయ సినిమాలో తొలి టైమ్-ట్రావెల్ సైన్స్ ఫిక్షన్ చిత్రంగా ఖ్యాతి పొందిన 'ఆదిత్య 369' (1991), సుధా చంద్రన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన స్ఫూర్తిదాయక నృత్య కావ్యం 'మయూరి' (1985) వంటివి ఆయన సృజనాత్మకతకు తార్కాణాలు. కమల్ హాసన్‌తో ఆయన తీసిన 'అపూర్వ సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' చిత్రాలు కూడా కమర్షియల్‌గా భారీ విజయాలు సాధించాయి. సాంకేతికత



అందుబాటులో లేని రోజుల్లోనే, గ్రాఫిక్స్, సీజీఐ హంగులు లేకుండానే తన కథనంతో ప్రేక్షకులను అబ్బురపరిచిన దర్శక మేధావి సింగీతం. ఆయన ప్రతిభకు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, నంది అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు ఎన్నోసార్లు వరించాయి. అద్భుతమైన విషయం ఏమిటంటే, 94 ఏళ్ల వయసులో కూడా ఆయన మళ్లీ దర్శకత్వం చేపట్టారు. వైజయంతీ మూవీస్ సమర్పణలో నాగ్ అశ్విన్ నిర్మించిన 'సింగ్ గీతం' అనే మ్యూజికల్ ఫాంటసీ చిత్రానికి ఈ ఏడాది దర్శకత్వం వహించారు. కేవలం 77 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. సింగీతం మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ నివాళులర్పిస్తూ, "ఆయన ఒక దార్శనికుడు. ఆదిత్య 369, పుష్పక విమానం, మయూరి వంటి ఆయన చిత్రాలు తరాలు మారినా తాజాగా అనిపిస్తాయి" అని పేర్కొన్నారు. బ్లాక్ అండ్ వైట్ 'మాయాబజార్' కాలం నుంచి 2026లో థియేటర్లలో విడుదలైన 'సింగ్ గీతం' వరకు ఆయన సినీ ప్రయాణం అసామాన్యమైనది, అజరామరమైనది.

## నాకు పిల్లలు వద్దు: వరలక్ష్మి

నటి వరలక్ష్మి శరత్ కుమార్ ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత పిల్లల గురించి ఆమె తీసుకున్న నిర్ణయం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. తనకు పిల్లలు వద్దని తాను, తన భర్త ఇద్దరూ నిర్ణయించుకున్నామని వరలక్ష్మి స్పష్టంగా చెప్పారు. 2024లో ముంబైకి చెందిన వ్యాపారవేత్త, గ్యాలరిస్ట్ నికోలాయ్ సచ్‌దేవ్‌ను వరలక్ష్మి వివాహం చేసుకున్నారు. తాజాగా వీడియో జాకీ భరణీ సురేష్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆమె పిల్లల గురించి తన అభిప్రాయాలను వెల్లడించారు. "నాకు పిల్లలు వద్దని వ్యక్తిగతంగా నిర్ణయించుకున్నాను. పిల్లలను కనలేనని కాదు. నాకు పిల్లలు వద్దని నేను అనుకుంటున్నాను. నా భర్త కూడా అదే ఆలోచనతో ఉన్నారు" అని వరలక్ష్మి చెప్పారు. తన భర్తకు గత వివాహం ద్వారా ఒక కుమార్తె ఉందని ఆమె తెలిపారు. ఆ అమ్మాయిని తాను తన సొంత కుమార్తెలాగే చూసుకుంటానని చెప్పారు. అలాగే తమకు రెండు కుక్కలు ఉన్నాయని, వాటిని కూడా తమ పిల్లలుగానే భావిస్తామని వరలక్ష్మి పేర్కొన్నారు.



## మాతృభూమికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా నటించిన మాతృభూమి' విడుదలకు ఎదురైన కీలక అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సినిమా కొత్త వెర్షన్ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రాజెక్ట్‌కు అభ్యంతరం లేదని పత్రం మంజూరు చేసినట్లు సమాచారం. కొన్ని నెలలుగా రకరకాల వివాదాలు, రీషూట్‌లు, విడుదల తేదీల మార్పుల వల్ల ఆగిపోయిన చిత్రానికి ప్రభుత్వ ఆమోదం లభించడంతో సల్మాన్ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్ర కథ తొలుత 2020లో గల్వాన్ లోయలో భారత, చైనా సైనికుల మధ్య జరిగిన భీకర ఘర్షణల ఆధారంగా రూపుదిద్దుకుంది. ప్రారంభంలో బ్యాటిల్ ఆఫ్ గల్వాన్ టైటిల్ తో తెరకెక్కిన చిత్రంలో చైనా వ్యతిరేక భావనలున్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సినిమా అసలు విడుదలవుతుందా? రద్దయిపోయిందా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే చిత్ర యూనిట్ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టకుండా స్క్రిప్ట్‌లో ... చిత్రీకరణలో గణనీయమైన మార్పులు చేయడానికి ముందుకు వచ్చింది. ప్రభుత్వ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని మేకర్స్ చిత్రంలో పలు సన్నివేశాలను రీషూట్ చేశారు.






## ప్రియాంక చోప్రా ప్లాన్స్ అదుర్స్

గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా బాలీవుడ్‌లో పెద్ద హీరోలతో ఎందుకు సినిమాలు చేయడం లేదనే చర్చ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్రంగా నడుస్తోంది. ఒకప్పుడు వరుస హిట్లు సాధించి..బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా వెలుగొందిన ఈ బ్యూటీ డన్‌గా హిందీ చిత్రాలకు దూరంగా జరగడం వెనుక పలు ఆసక్తికరమైన కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా గతంలో కొందరి తీరు కారణంగా తాను ఇండస్ట్రీలో అణచివేతకు గురయ్యానని అందుకే బాలీవుడ్‌ను వీడి హాలీవుడ్ బాట పట్టానని ప్రియాంక స్వయంగా గత ఇంటర్వ్యూలలో వెల్లడించారు. అయితే, వారణాసితో పీసీ తిరిగి భారతీయ చలనచిత్ర పరిశ్రమలోకి ముఖ్యంగా సౌత్ ఇండస్ట్రీలోకి గ్రాండ్‌గా రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు పెద్ద బూస్ట్ అని చెప్పవచ్చు. వారణాసి సినిమా తర్వాత ప్రియాంక చోప్రా తన తదుపరి ప్రణాళికలను మరింత పక్కాగా అమలు చేస్తున్నారు. చాలా కాలం తర్వాత ది లంచ్ బాక్స్ దర్శకుడు రితేష్ బత్రా తెరకెక్కించనున్న ఒక ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ కోసం సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి నటించేందుకు చర్చలు జరుపుతున్నారు. ఒకవేళ ఈ ప్రాజెక్ట్ ఖరారైతే.. ఈ ఇద్దరు స్టార్స్ లీడ్ రోల్స్‌లో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఇదే మొదటిసారి అవుతుంది. ఇన్నాళ్లు బాలీవుడ్ డైరెక్ట్ సినిమాలకు దూరంగా ఉన్న ప్రియాంక ఇప్పుడు గ్లోబల్ స్టాండర్డ్స్‌తో కూడిన కంటెంట్-డ్రివెన్ చిత్రాలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను వినూత్నంగా మలుచుకుంటున్నారు. భవిష్యత్ లైనప్ చూస్తుంటే..బాలీవుడ్ పెద్ద హీరోలతో సంబంధం లేకుండానే పీసీ తనకంటూ ఒక ప్రత్యేకమైన.. తిరుగులేని స్థానాన్ని అంతర్జాతీయ స్థాయిలో సుస్థిరం చేసుకుంటున్నారని స్పష్టమవుతోంది.



## జీవితంలో వేడుకలు ముఖ్యం: రష్మిక

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్-ఇండియా చిత్రం 'రణబాలి' అక్టోబర్ 16న గ్రాండ్‌గా థియేటర్స్‌లోకి రాబోతోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్‌లో ఇప్పటికే విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం సినిమా ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉన్న రష్మిక.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన భర్త విజయ్ దేవరకొండ గురించి మాట్లాడుతూ ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. విజయ్ ఏ పండుగను, వేడుకను అంతగా సెలబ్రేట్ చేసుకోవడానికి ఇష్టపడడని రష్మిక తెలిపారు. కానీ తాను మాత్రం ప్రతి పుట్టినరోజును, ప్రతి చిన్న వేడుకను ఎంతో ఆనందంగా జరుపుకోవాలని కోరుకునే మనస్తత్వమని చెప్పారు. మనుషుల వయసు రోజురోజుకూ పెరిగిపోతుందని, ఈ లోకంలో మనకు ఇంకా ఎంత కాలం ఆయువు ఉందో ఎవరికీ తెలియదని ఆమె అన్నారు. అందుకే ప్రతి క్షణాన్ని, ప్రతి వేడుకను సంతోషంగా ఆస్వాదించడం చాలా ముఖ్యమని తాను నమ్ముతానని, అయితే విజయ్‌కి మాత్రం ఇలాంటి వాటిపై పెద్దగా ఆసక్తి ఉండదని ఆమె నవ్వుతూ చెప్పారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## భోజ్‌పూరీకి మృణాల్!

మృణాల్ ఠాకూర్ అంటే సీతారామం చిత్రంలోని సీత పాత్రే కళ్ల ముందుకొస్తుంది. నాటి నుంచి గ్లామర్ షోల కంటే నటనకు ప్రాధాన్యమున్న వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న భామ దక్షిణాదిలోనే గాక ఉత్తరాదిలోనూ వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఈ క్రమంలోనే మృణాల్ ఠాకూర్ త్వరలోనే భోజ్‌పురి చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వబోతోందంటూ నెట్టింట ఓ వార్త హల్‌చల్ చేస్తోంది. భోజ్‌పురి నటుడు, లోక్‌సభ సభ్యుడు అయిన రవికిషన్‌తో కలిసి మృణాల్ ఓ ప్రాజెక్ట్ కమిట్ అయిందని





# రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్‌కు గోల్డ్

ఆసియా క్రీడలు 2026లో భారత రెజ్లర్ అమన్ శెహ్రావత్ సంచలనం సృష్టించాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ హాన్ చోంగ్ సాంగ్‌ను 11-7 తేడాతో ఓడించి స్వర్ణ పతకం సాధించాడు. దీంతో ఈ విభాగంలో ఆసియా క్రీడల స్వర్ణం గెలిచిన తొలి భారత రెజ్లర్‌గా అమన్ చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం ఆసియా క్రీడల్లో భారత స్వర్ణ పతకాల సంఖ్య 20కు చేరింది. నగోయా సిటీ ఇనాయే స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఫైనల్ హోరాహోరీగా సాగింది. రెండో భాగంలో అమన్ 6-1 ఆధిక్యంలో ఉన్నాడు. అయితే ఉత్తర కొరియా రెజ్లర్ పుంజుకున్నాడు. వరుస పాయింట్లతో 7-6 ఆధిక్యంలోకి వెళ్లాడు. సమయం ముగిసే దశలో అమన్ అద్భుతంగా పుంజుకున్నాడు. టేక్‌డౌన్‌తో రెండు పాయింట్లు సాధించి, ఆ తర్వాత రోల్ ద్వారా మరో రెండు పాయింట్లు దక్కించుకున్నాడు. దీంతో 11-7 ఆధిక్యంలోకి వెళ్లాడు. ప్రత్యర్థి ఆ పాయింట్లపై ఛాలెంజ్ చేసినా ఫలితం లేకపోయింది. పైగా ఒక పాయింట్ కోల్పోవడంతో అమన్ ఆధిక్యం మరింత పెరిగింది. చివరి 30 సెకన్లలో ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నాడు.

## ఆసియా క్రీడల్లో కుంకుమ్ చరిత్ర

**ఆర్చరీలో తొలి వ్యక్తిగత స్వర్ణం!**



భారత యువ ఆర్చర్ కుంకుమ్ మోహొద్ ఆసియా క్రీడల్లో చారిత్రక విజయం సాధించింది. శనివారం జరిగిన మహిళల వ్యక్తిగత రికర్వ్ ఫైనల్‌లో 17 ఏళ్ల కుంకుమ్ స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. జపాన్‌లోని ఐచి-నగోయాలో జరిగిన ఈ పోటీలో, దక్షిణ కొరియా ఆర్చర్ ఓ యెజిన్‌పై షూటౌట్‌లో 6-5 తేడాతో గెలుపొందింది. ఆసియా క్రీడల చరిత్రలో మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణ పతకం కావడం విశేషం. ఫైనల్ మ్యాచ్ చివరి వరకు హోరాహోరీగా సాగింది. నిర్ణయాత్మక షూటౌట్‌లో ఓ యెజిన్ 8 పాయింట్లు సాధించగా, కుంకుమ్ పర్ఫెక్ట్ 10 స్కోర్ చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది. అంతకుముందు మ్యాచ్‌లో ఒక దశలో 3-5తో వెనుకబడిన కుంకుమ్, ఒత్తిడిని జయించి వరుసగా మూడు 10 పాయింట్లు సాధించి స్కోరును 5-5తో సమం చేసింది. దీంతో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది. ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌లో మరో దక్షిణ కొరియా క్రీడాకారిణి కాంగ్ చాయోంగ్‌ను, సెమీఫైనల్‌లో చైనాకు చెందిన జు జింగీని ఓడించి కుంకుమ్ ఫైనల్‌కు చేరింది. ఈ క్రీడల్లో కుంకుమ్‌కు ఇది మూడో పతకం. శుక్రవారం జరిగిన మహిళల టీమ్ ఈవెంట్‌లో అంకితా భగత్, కీర్తి శర్మలతో కలిసి స్వర్ణం గెలిచింది. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ధీరజ్ బొమ్మదేవరతో కలిసి రజతం సాధించింది. ఈ అద్భుత విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు భారత్‌కు వ్యక్తిగత కోటా స్థానాన్ని కూడా కుంకుమ్ ఖరారు చేసింది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఆసియా క్రీడల్లో భారత్ మొత్తం 77 పతకాలతో (17 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలు) కొనసాగుతోంది.

## చివరి వన్డే విండీస్‌దే

భారత్ చేతిలో వెస్టిండీస్ జట్టు వైట్‌వాష్ తప్పించుకుంది. షై హోప్ (162 నాటౌట్) భారీ శతకంతో విజృంభించడంతో శనివారం జరిగిన మూడో, చివరి వన్డేలో 5 వికెట్లతో టీమిండియాను ఓడించింది. ఫలితంగా సిరీస్‌ను స్వీప్ చేయలేకపోయిన భారత్ 2-1తో సరిపెట్టుకుంది. హోప్ మెరుపులతో భారత్ ఇచ్చిన 352 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 48.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జంగూ (67), కీమో పాల్ (44) రాణించారు.తొలుత భారత్ 50 ఓవర్లలో 351/7 చేసింది. కేఎల్ రాహుల్ (129 నాటౌట్) సెంచరీ కొట్టగా..రోహిత్ శర్మ (92), రుతురాజ్ (57) కూడా సత్తా చాటారు. హోప్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, గిల్‌కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్‌లో తొలి పోరు మంగళవారం లక్నోలో జరుగుతుంది.





# ఆసియా క్రికెట్ విజేత టీమిండియా



## పురుషుల క్రికెట్‌లో భారత్‌కు స్వర్ణ పతకం

### ఫైనల్లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు మరోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం తెలిసిందే. జపాన్‌లోని నిషిన్‌లో శనివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో పసిడిని నిలబెట్టుకుని సత్తా చాటింది. ఈ అద్భుత విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ భారత జట్టును అభినందించారు. ఇది దేశానికి ఎంతో ఆనందకరమైన సందర్భమని కొనియాడారు. "భారత్‌కు మళ్లీ స్వర్ణం దక్కింది! ఆసియా క్రీడల్లో టైటిల్ నిలబెట్టుకున్న మన పురుషుల క్రికెట్ జట్టుకు అభినందనలు. భవిష్యత్తులోనూ జట్టు సభ్యులు మరిన్ని విజయాలు సాధించాలి" అని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అంతకుముందు, ఐసీసీ ఛైర్మన్ జై షా కూడా జట్టును అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ భారీ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ కేవలం 28 బంతుల్లో 61 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. పాకిస్థాన్‌పై టీ20ల్లో ఒక భారత బ్యాటర్ చేసిన వేగవంతమైన అర్ధ సెంచరీ ఇదే. ఆ తర్వాత తిలక్ వర్మ 22 బంతుల్లోనే 51 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరును పరుగులు పెట్టించాడు. వీరితో పాటు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే కూడా రాణించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. అనంతరం 212 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగా పోరాడింది. ఆ జట్టు బ్యాటర్ హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. ఒక దశలో పాకిస్థాన్ గెలుపు దిశగా సాగుతున్నట్టు కనిపించినా, భారత బౌలర్లు చివరిలో ఒత్తిడిని జయించారు. కీలక సమయంలో వికెట్లు తీసి మ్యాచ్‌ను అదుపులోకి తెచ్చుకున్నారు. చివరి బంతికి నవాజ్‌ను శివమ్ దూబే ఔట్ చేయడంతో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 6 వికెట్ల నష్టానికి 192 పరుగుల వద్ద ముగిసింది. దీంతో భారత ఆటగాళ్లు సంబరాల్లో మునిగిపోయారు.



# హాకీలోనూ డబుల్ గోల్డ్

**పురుషుల స్వర్ణం కూడా భారత్ కైవసం**



ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5-1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం. జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్స్ సాధించి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5-1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు.

**చారిత్రాత్మక డబుల్ గోల్డ్**

ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1-0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆఖరి నిమిషంలో గోల్ చేసి 4-3 తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతకుముందు లీగ్ దశలో ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్లపై భారీ గోల్స్ తేడాతో విజయాలు నమోదు చేసి తన సత్తా చాటింది. ఈ అద్భుత విజయంతో భారత హాకీ జట్టు ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్స్‌కు సిద్ధమవుతోంది.

# సాంబా.. గోల్స్ కొడితే!

**కోల్‌కతాలో బ్రెజిల్ ఫుట్‌బాల్ విన్యాసాలు**

### భారత్‌పై ఈజీ విక్టరీ.. 4-0 గోల్స్ తేడాతో భారత్ చిత్తు

భారత ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన స్నేహపూర్వక మ్యాచ్‌లో టీమిండియాకు నిరాశే ఎదురైంది. శనివారం కోల్‌కతాలోని వివేకానంద యువభారతి క్రీడాంగణం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పటిష్ఠమైన బ్రెజిల్ జట్టు 4-0 గోల్స్ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఆట ప్రారంభం నుంచి చివరి వరకు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన బ్రెజిల్, తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో ఆకట్టుకుంది. భారత జట్టు గట్టిపోటీ ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ, బ్రెజిల్ అటాకింగ్, డిఫెన్స్ విభాగాల ముందు నిలవలేకపోయింది. నేమార్ వంటి అగ్రశేణి ఆటగాళ్లు లేకపోయినా, బ్రెజిల్ దూకుడు ముందు భారత్



నిలవలేకపోయింది. మ్యాచ్ ఆరంభం నుంచే బ్రెజిల్ దూకుడుగా ఆడింది. బంతిని తమ నియంత్రణలోనే ఉంచుకుంటూ భారత గోల్ పోస్ట్‌పై పదేపదే దాడులు చేసింది. ఈ క్రమంలో 28వ నిమిషంలో మాథ్యూజిన్హో అందించిన పాస్‌ను సద్వినియోగం చేసుకున్న ఎస్టెవావో అద్భుతమైన గోల్ చేసి బ్రెజిల్‌కు ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం, తొలి అర్ధభాగం ముగియడానికి కొద్ది నిమిషాల ముందు (42వ నిమిషం) ఎస్టెవావో సహకారంతో పెడ్రో మరో గోల్ సాధించాడు. దీంతో విరామ సమయానికి బ్రెజిల్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ బ్రెజిల్ అదే జోరును కొనసాగించింది. భారత జట్టు పుంజుకోవడానికి ప్రయత్నించినా, వారి వ్యూహాలు ఫలించలేదు. 58వ నిమిషంలో పెడ్రో అందించిన అసిస్ట్‌తో శామ్యూల్ లినో తన తొలి గోల్ చేసి, బ్రెజిల్ ఆధిక్యాన్ని 3-0కి పెంచాడు. ఆ తర్వాత కూడా భారత జట్టుపై ఒత్తిడి తగ్గించని బ్రెజిల్, అదనపు సమయంలో (90'ం5) మరోసారి సత్తా చాటింది. మౌరో జూనియర్ పాస్‌తో శామ్యూల్ లినో తన రెండో గోల్ కొట్టి బ్రెజిల్ విజయాన్ని ఖరారు చేశాడు. గణాంకాలు పరిశీలిస్తే, మ్యాచ్‌లో బ్రెజిల్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. బ్రెజిల్ జట్టు బంతిని 66 శాతం తన అదుపులో ఉంచుకోగా, భారత్ 34 శాతంతో సరిపెట్టుకుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 4-10-2026, జగిత్యాల


ఓ మంచి దేవుడా..
ఉన్నోళ్లకు వీఐపీ దర్శనం ఇచ్చినవ్..
పైసలిస్తే ప్రత్యేక దర్శనం కల్పించినవ్..
ప్రత్యేక సేవలు చేపించుకున్నవ్..
ప్రత్యేక పూజలూ చేపించుకున్నవ్..

**"దేవుడి ముందు అంతా సమానం అని అబద్ధాలు ఆడుతున్నవ్"**

ఓ మంచి దేవుడా..
లేనోళ్లకు క్షణం పాటైనా దర్శనం ఇవ్వవ్..
పైసల్లేకుంటే ప్రత్యేక పూజలు చేయనీయవ్..
గంటల పాటు క్యూలో ఉంచి కష్టపెడ్తవ్..
పరపతి లేకపోతే నిన్ను చూసే లోగానే పక్కకు నెట్టేస్తవ్..

**"మళ్లా.. దేవుడి ముందు అంతా సమానం అని అబద్ధాలు చెప్తున్నవ్"**

ఏమయ్యా శివయ్యా.. నువ్వు దక్షిణాది వాడివంట కదా..!
మరి కాశీలో ఎందుకున్నవయ్యా?
ఏమయ్యా రామయ్యా.. నువ్వు ఉత్తరాది వాడివంట కదా..!
మరి భద్రాచలంలో ఎందుకున్నవయ్యా?
ఏమయ్యా శివయ్యా.. నీ దగ్గరికి పేదోళ్లే వస్తరా?
ఏమయ్యా రామయ్యా.. నీ దగ్గరికి ఉన్నోళ్లే రావాల్నా?

**శివుడే మొదటివాడని ఒకరు అంటారు..
విష్ణువే పరముడని మరొకరు అంటారు..
రాముడే ఆదర్శమని ఇంకొకరు అంటారు..
కృష్ణుడే పరబ్రహ్మమని మరొకరు అంటారు..
అమ్మవారే శక్తి అని ఇంకొకరు అంటారు..
అందుకే.. నీ దేవుడు వేరు.. నా దేవుడు వేరు!**



శ్రావణ వాణి

# తప్పంతా.... దేవుడిదే!



**శ్రావణ్ కుమార్ బొమ్మకంటి**
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్బీ
9581291919, 9441291919

శివుడి గుడికి వెళ్లే పేదవాడి కళ్లలో కన్నీళ్లు ఉంటాయి. రాముడి గుడికి వెళ్లే పేదవాడి కళ్లలోనూ కన్నీళ్లే ఉంటాయి. శివుడి ముందు రైతు తన పంట కోసం మొక్కుతాడు. రాముడి ముందు అదే రైతు తన కుటుంబం కోసం మొక్కుతాడు. రాముడిని పూజించే పేదవాడు ధనికుడైపోతాడా? శివుడిని పూజించే ధనికుడు పేదవాడైపోతాడా? అసలు.. దేవుడా! అది నీ తప్పు కాదంటావా? శైవం ఒక సంప్రదాయం.. వైష్ణవం ఒక సంప్రదాయం.. శాక్తం ఇంకో సంప్రదాయం.. రాముడి గుడిలో వైష్ణవులే పూజలు చేయాలని చెప్తివి.. శివుడి గుడిలో బ్రాహ్మణులే పూజలు చేయాలని చెప్తివి.. అందుకే! రేవంత్ రెడ్డి అన్నది తప్పు కాదు. ధనిక-పేద, ఉత్తర-దక్షిణ తేడాలు అసలు తప్పే కావు. అందుకే! దేవుడు రాజకీయ పావులా మారిపోయాడు. అందుకే! దేవుడే ఓ సమస్యై పోయాడు. ఓ దేవుడా.. నువ్వు పక్షపాతివేనయ్యా. కులానికో దేవుడిగా మారిపోయావ్. కులానికో గుడిని కట్టించుకున్నవ్. మతానికో వేషం కట్టినవ్. వర్గానికో అవతారం ఎత్తినవ్. పేదోడిని దేవుడు పట్టించుకోడు. ఎందుకంటే.. పూర్వజన్మ కర్మ.. దేవుడి పరీక్ష.. మొక్కు తీర్చలేదు.. పూజ చేయలేదు.. దోషం ఉంది.. లాంటి కారణాలున్నాయి. పెద్దోళ్లనే దేవుడు పట్టించుకుంటాడు.. యజ్ఞయాగాదులు చేస్తరు, భారీ పూజలు, ఖరీదైన కార్యక్రమాలు జరిపిస్తరు.. భారీ నైవేద్యాలు పెడ్తడు.. అందుకే ఉన్నోళ్లకు మస్తు పైసలిస్తడు. సంతోషంగా ఉంచుతడు. పేదోడు మాత్రం ఒక దీపం వెలిగిస్తాడు. అందుకే, పేదోళ్లపై దేవుడు కనికరం చూపుతలేడు..? కష్టం వస్తే నీ గుడి మెట్లెక్కుతం. అప్పులు పోవాలని మళ్లా అప్పుచేసి మొక్కులు తీర్చుకుంటం.. ఎములాడకు వచ్చి నిలువుదోపిడీ ఇచ్చుకుంటాం. కొమురవెల్లికి వెళ్లి పంచ ముగ్గుల పట్నాలు వేస్తం. తిరుపతి పోయి గుండు గీయించుకుంటాం. అమ్మకు బెల్లబువ్వ పెడ్తం.. ఇంట్లో పూట గడవకపోయినా హుండీలో కానుక వేస్తం. పిల్లల ఫీజులకు డబ్బులు లేకపోయినా మొక్కు తీర్చడానికి మాత్రం దారి చూసుకుంటాం. ఎందుకంటే నువ్వు మా దేవుడివని అనుకుంటాం.. కానీ, నువ్వు ఉన్నోళ్ల దేవుడివి అయిపోతివి.

ఇక, శివకేశవా.. మీ సంగతేంటి? ప్రజలకు కావాల్సింది మీ మధ్య పోటీ కాదు.. జీవితాల్లో మార్పు. ధరలు పెరుగుతున్నాయి. అప్పుల భారం పెరుగుతోంది. ఉద్యోగాల కోసం యువత ఎదురుచూస్తోంది. రైతు తన పంటకు గిట్టుబాటు కోసం చూస్తున్నాడు. పట్టణాల్లో రహదారులు, మౌలిక వసతుల సమస్యలు ఉన్నాయి. గ్రామాల్లో అనేక ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయి. ఇలాంటి సమయంలో పాలకుల చర్చ రాముడు ఎవరి దేవుడు? శివుడు ఎవరి దేవుడు? అనే స్థాయికి దిగజారితే సామాన్యుడికి దానివల్ల ప్రయోజనం ఏమిటి? ప్రజలను కలపాల్సిన పదవిలో ఉన్నవారు ప్రజల విశ్వాసాల మధ్య గోడలు కట్టకూడదు. రాజకీయ ప్రత్యర్థిపై పోరాటం రాజకీయ వేదికపైనే జరగాలి. దేవాలయ గర్భగుడిలోకి ఆ పోరాటాన్ని తీసుకెళ్లకూడదు. రాముడు ఈ నేలవాడే. శివుడూ ఈ నేలవాడే. వీరి మధ్య తేడాలతో ప్రజలకు ఏం లాభం? సామాన్యుడికి మాత్రం దీని వల్ల ఒక్క రూపాయి ఆదాయం పెరగదు. ఒక్క నిరుద్యోగికి ఉద్యోగం రాదు. ఒక్క రైతు అప్పు తీరదు. ఒక్క కుటుంబం కష్టాలు తగ్గవు. ఎల్ నినో ఆగదు. వాతావరణ మార్పులు తగ్గవు. భూగర్భజలాలు పెరగవు. చెరువులు నిండవు. పంటలు పండవు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ ధర తగ్గదు. అప్పులపై వడ్డీ ఆగదు. ఆసుపత్రి బిల్లు తగ్గదు.

రైతుకు కావాల్సింది వర్షం.. శివుడు ఎవరివాడు? రాముడు ఎవరివాడు? అని కాదు. యువకుడికి కావాల్సింది ఉద్యోగం.. దేవుళ్ల మధ్య తేడాలపై ప్రసంగం కాదు. ఎల్ నినోకు తెలుసా..శివుడు దక్షిణాది వాడు, రాముడు ఉత్తరాది వాడు అని? వర్షం పడకపోతే సాగునీటి ప్రణాళిక ఏమిటి? చెరువుల్లో నీరు లేకపోతే ప్రత్యామ్నాయం ఏమిటి? భూగర్భజలాలు పడిపోతే చర్య ఏమిటి? వాతావరణ మార్పులతో పంటలు దెబ్బతింటే రైతుకు రక్షణ ఏమిటి? అకాల వర్షాలతో పంట నష్టపోతే పరిహారం ఎంత? నీటి వనరులను కాపాడాలి. చెరువులను పునరుద్ధరించాలి. అడవులను కాపాడాలి. నిధులు తేవాలి. ప్రణాళికలు అమలు చేయాలి. చర్చకు రావాల్సింది వీటిపై కదా. వీటిపై కదా పాలకులు ఆలోచించాల్సింది. పనికిమాలిన మాటలు కాదు. ప్రజల సమస్యలకు పరిష్కారం కావాలంటే దేవుళ్లను కాదు.. విధానాలను మార్చాలి. నినాదాలను కాదు.. ప్రణాళికలను మార్చాలి. ప్రజల విశ్వాసాలను కాదు.. పాలనా ప్రాధాన్యాలను గుర్తించాలి. దేవుళ్లు ఎవరివారైనా కావచ్చు.. ప్రజల బతుకు మాత్రం అందరిది. వాళ్లే నిర్ణయించుకుంటారు దేవుడు తమ వాడా? కాదా? అని. దేవుడి పేరుతో వివక్ష, వాణిజ్యం, రాజకీయ వినియోగం ఆపాలె. ప్రజా సమస్యలపైనే పాలన సాగాలె.



**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.